క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని దర్మంపూరి, గోండుగూడలో ఆదివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టరేట్ పొందిన ప్రభాకర్‌కు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఇటీవల డాక్టరేట్ పొందిన దాసండ్ల ప్రభాకర్‌ను మండలంలోని దంతన్‌పల్లి జామ మస్జిద్ కమిటీ యువకులు ఆదివారం సన్మానించారు. సామాజిక సేవ చేస్తూ.. ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న ప్రభాకర్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, ముజీబ్, సత్తార్, మునీర్, సులేమాన్, శంషొద్దిన్, యూసూఫ్, శారీక్, సురేశ్, సాగర్, మోయిన్ పాల్గొన్నారు.

'ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలి'



మాట్లాడుతున్న పూర్ణచందర్‌నాయక్

ఇంద్రవెల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పూర్ణ చందర్‌నాయక్ కోరారు. ఆదివారం మండలంలోని కోయల్‌పాండ్రి, మల్కుగూడ గ్రామాల్లో పర్యటించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ.. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పుర్క చిత్రు, భీంరావ్, తదితరులు, పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని దుర్గనగర్‌లోని శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయంలో ఏప్రిల్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు 108 హోమ కుండలతో నిర్వహించనున్న శత చండీ యాగం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ మహరాజ్ మాట్లాడుతూ.. శత చండీ యాగం సందర్భంగా లక్ష కుంకుమార్చన, పుష్పార్చన, దీపార్చనతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని యూనివర్సల్ కంప్యూటర్ కేంద్రం వద్ద మిర్జ జీలానిబేగ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

సాక్షి, ఆదిలాబాద్: బోథ్ మండల కేంద్రానికి చెందిన బైరి సహస్ర నవోదయ పాఠశాలకు ఎంపికైంది. నాగభూషణం హైస్కూల్ ఐదో తరగతి చదువుతున్న సహస్ర ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నవోదయకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు సహస్రను అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 46 మంది గర్భిణులకు వైద్యాధికారి కౌస్తూభా స్కానింగ్ పరీక్షలు చేశారు. తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్స్, ప్రవీణ, సిబ్బంది సాహితి, మయావతి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి కంకర తరలింపు

తాంసి: మండలంలోని వివిధ స్టోన్ క్రషర్ల నుంచి పరిమితికి మించి కంకరను తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంతో వివిధ గ్రామాలకు అంతర్రాష్ట్ర రహదారి గుండా తరలించడంతో కంకర రాళ్లు రోడ్డుపై పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రవాణాశాఖ అధికారులు స్పందించి పరిమితికి మించి కంకర తరలిస్తున్న టిప్పర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది లేక ఇబ్బంది



బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- రోగులకు తప్పని తిప్పలు
- సాయంత్రం అయితే అందని వైద్య సేవలు
- ప్రసూతికి రిమ్స్‌కి రెఫర్

బేల: మండల కేంద్రంలోని రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే ఔట్ పేషెంట్ వైద్య సేవలు అందుతున్నాయి. మిగతా సమయంలో మాత్రం వైద్య సేవలు అందడం లేదు. గర్భిణుల ప్రసూతికి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీలో 24గంటల వైద్య సేవల కోసం షిఫ్టులు వారీగా నలుగురు స్టాఫ్ నర్సులు, ఒక వైద్యాధికారి, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. గత రెండు నెలల క్రితం ఇక్కడి స్టాఫ్ నర్సులకు రెగ్యులర్ ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. ఇక్కడికి డిప్యూటేషన్‌పై ఉన్న మరొకరు వెళ్లిపోయారు. ఇక్కడి నుంచి ఇతర చోటకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఇంకొక స్టాఫ్ నర్సు, మెడికల్ సూపర్‌వైజర్ జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు వెళ్లినా.. ల్యాబ్ టెక్నీషియన్ 45 రోజుల క్రితం ఇక్కడికి తిరిగి వచ్చి విధుల్లో చేరారు. కానీ ముగ్గురిలో ఒకరు నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తుండగా.. మరో ఇద్దరు అధికారుల అండదండలతో విధుల్లో చేరిన తరువాత పత్తా లేకుండా పోయారు.

సాయంత్రం వరకే..

పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవల కోసం ఉండాల్సిన నలుగురు స్టాఫ్ నర్సుల్లో ఒకరు మాత్రమే ఉండగా.. మిగతా మూడు పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒక స్టాఫ్ నర్సుకు(మగ) రాత్రివేళ విధులు కేటాయించడంతో సరిగా అందుబాటులో ఉండడం లేదు. మిగతా ముగ్గురు స్టాఫ్ నర్సులకు బదులు ప్రత్యామ్నయంగా క్షేత్రస్థాయిలో ఆరోగ్య ఉపకేంద్రాల్లో అందుబాటులో ఉండే ఏఎన్‌ఎంలు (ఒక ఫార్మసిస్ట్, ఒక రెగ్యులర్ వైద్యుడు) ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే ఔట్ పేషెంట్ వైద్య సేవలు అందిస్తున్నారు. వారంలో వీరికి వీక్లీ ఆఫ్ సమయంలో ఆరోగ్య ఉప కేంద్రాల హెల్త్ అసిస్టెంట్‌లకు విధులు కేటాయించారు. వీరు విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో వైద్య సేవలు అందడం లేదని బాధిత రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెగ్యులర్ స్టాఫ్ నర్సు లేకపోవడంతో..

పీహెచ్‌సీలో రెగ్యులర్ స్టాఫ్ నర్సులు పోస్టులు ఖాళీగా ఉండడంతో గర్భిణుల ప్రసూతిలు తగ్గిపోయాయి. ఒకపక్క ఉన్న క్షేత్రస్థాయి సిబ్బంది పనిభారంతో తమకేందుకు రిస్క్ అని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. దీంతో చేసేదేమి లేక పలువురు గర్భిణులు ప్రసూతిల కోసం జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు.

రాత్రి ఎవరూ ఉండడం లేదు



బేలలో గవర్నమెంటు దవాఖానాకు రాత్రి 8గంటలకు వెళ్లినా.. కానీ అక్కడ వైద్య సిబ్బంది ఎవరూ లేరు. కేవలం ఒక వాచ్‌మెన్ మాత్రమే ఉన్నారు. గోళీలు, మందులు అడినాను. కానీ ఇవ్వలేదు. వైద్య సిబ్బంది వస్తరేమోనని ఎదురు చూసిశా.. ఎవరు రాకపోవడంతో ఆర్‌ఎంపీని ఆశ్రయించినా.

– రాజుల్కర్ సునీల్, గంగూల్‌గూడ, బేల

ఛాతిలో నొప్పి వచ్చిందని వెళ్లాను



ఛాతీలో నొప్పి వచ్చిందని పీహెచ్‌సీకి వెళ్లాను. కానీ అక్కడ వైద్య సిబ్బంది లేరు. తలుపు కొడితే వాచ్‌మెన్ వచ్చి ఎవరూ లేరని చెప్పారు. దీంతో ప్రైవేట్ వైద్యుడిని ఆశ్రయించి, చికిత్స చేయించుకున్నా. దీంతో ఆర్థికం నష్టపోయాను.

–పోత్రాజ్ స్వామి, అశోక్‌నగర్, బేల

చెరువు నిండా పిచ్చిమొక్కలు



పిచ్చిమొక్కలతో నిండిన బజార్‌హత్నూర్ చెరువు

- తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి సమీపంలోని చెరువు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రూ.24 కోట్లతో చెరువు నిర్మాణం ప్రారంభించారు. చెరువు పూర్తయినా.. కాలువల పనులు మధ్యలోనే లో ఆగిపోయాయి. అయితే టీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా కాలువల ఆధునీకరణ పనులకు 12.50 కోట్లు మంజూరు చేసింది. కానీ 17సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన చెరువులో నల్లరేగడి మట్టి నిండుకోవడంతో నీటిమట్టం సగానికి పైగా తగ్గింది. చెరువు మధ్య నుంచి 2కి.మీ దూరం వరకు పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. దీంతో నీటిమట్టం సగానికి పైగా తగ్గింది. చెరువు నిర్మించారే తప్పా ఎవరికీ ప్రయోజం లేదని బజార్‌హత్నూర్, దేగామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే నెల వరకు చెరువులో నీళ్లు ఉండవని పశువులు త్రాగడానికి మాత్రమే ఉంటాయని రైతులు చెబుతున్నారు. చెరువు కుడి, ఎడమ కాలువల ద్వారా బజార్‌హత్నూర్, దేగామ, బలన్‌పూర్, గిర్నూర్, కాండ్లీ, వర్తమన్నూర్, ఎల్లయ్యపల్లి, కొత్తపల్లి, మొహద, ఇచ్చోడ మండలంలోని సాత్‌నంబర్ గ్రామం వరకు నీటి పారుద సౌకర్యం ఉంది. 4వేల ఎకరాలు ఆయకట్టు ఉంటే ప్రస్తుతం 500 ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, పూడిక తీయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీటి నిల్వ పెంచాలి



ప్రస్తుతం చెరువులో నీటి నిల్వ తగ్గింది. పిచ్చిమొక్కలు పెరిగి పూడికతో నిండింది. కనీసం ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి లేదు. ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించి పిచ్చి మొక్కలను, పూడికను తొలగిస్తే నీటి నిల్వ పెరుగుతుంది. 4వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

మడ్డె రమేశ్, రైతు, దేగామ

పూడిక తొలగిస్తాం

మిషన్ కాకతీయ ద్వారా బజార్‌హత్నూర్ చెరువులో 2019లో రూ. 30లక్షల నిధులతో 70 క్యూబిక్ మీటర్ల వరకు పూడికను తొలగించారు. మళ్లీ మట్టి నిండుకుంది. బజార్‌హత్నూర్ చెరువుతో పాటు, భూతాయి(బి), భూతాయి(కె) చెరువు మరమ్మతులు చేసేందుకు అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైతే పూడిక పూర్తిగా తొలగిస్తాం.

– తిరుపతి ఏఈ, నీటిపారుదల శాఖ

మనిషిని నడిపించేది భగవంతుడే



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మనిషిని నడిపించేది భగవంతుడేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సృష్టిలో ప్రతి జీవిలో పరమాత్ముడు ఉన్నాడన్నారు. ఆయా గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి యజ్ఞ హోమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువాతో సత్కరించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, అంబేకర్ పండరి, దేవేందర్ రెడ్డి, సాబ్లే ప్రతాప్ సింగ్, రాథోడ్ సురేందర్, విశ్వహింద్ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని నర్సాపూర్ పంచాయతీ పరిధిలోని హరినాయక్ తండాల్లో పర్యటించారు. బోథ్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు నడిపించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గతంలో పాలించిన పాలకులు పట్టించుకోకపోవడంతో నియోజకవర్గంలో ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామాల వారీగా ప్రజా సమస్యలను పరిష్కారిస్తామన్నారు. తనను ఆదరించి ఓట్లు వేసి గెలపించిన వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

నేరడిగొండ: ఆపద సమయంలో అధైర్య పడొద్దని అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన బండి బక్కన్న ఇటీవల చెందడంతో ఆదివారం వారి నివాసానికి చేరుకొని, కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అటుగా వెళ్తున్న సమయంలో వాంకిడి వద్ద మహారాష్ట్రకు చెందిన మహిళకు రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా, గమనించిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ప్రైవేట్ వాహనంలో చికిత్స నిమిత్తం నేరడిగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వాంకిడి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

ప్రజా ప్రభుత్వాన్ని టచ్ చేస్తే భస్మమే

- కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి 'కంది'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: తాము తలచుకుంటే రాష్ట ప్రభుత్వాన్ని 48గంటల్లో కూల్చేస్తామంటూ బీజేఎల్‌పీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న పిచ్చిప్రేలాపనలు వెంటనే ఆపాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని టచ్ చేస్తే భస్మం కాక తప్పదని హెచ్చరించారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రభుత్వాన్ని పడగొడతామంటే వారే తరిమికొడతారన్నారు. బీఆర్‌ఎస్ పనైపోయిందని పార్లమెంట్ ఎన్నికల తర్వాత కారు పార్టీ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్, రషీద్, షకీల్, భోజారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం పట్టణ శివారులోని రత్న గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ ముద్దు బిడ్డ ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కోలిపూర, శాంతినగర్, టీచర్స్‌కాలనీలకు చెందిన పలువురు యవకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామన్నారు. నర్సాపూర్(జె), నర్సాపూర్(బి) గ్రామాల్లో త్వరలో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింంపల్లి చంద్రయ్య, మోబీన్, మాజీ సర్పంచ్ భీమన్న, గ్రామ అధ్యక్షుడు షరీఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా చందు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా టి.చందు నియమాకమయ్యారు. ఈ మేరకు పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియమాక పత్రాన్ని అందజేసి, పార్టీ పటిష్టతకు పాటు పడాలని సూచించారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



సుశీలను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డీనేట్‌గా పదవీ విరమణ చేసిన ఏరే సుశీలను ఆదివారం పలువురు సన్మానించారు. మావల మండల కేంద్రంలోని తన నివాసంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఇందులో రాంసుందర్, కేశవ్, మురళీ, తొగరి భాస్కర్, నల్ల రాజేశ్వర్, ధోనిపెల్లి నాగేశ్వర్, సుధీర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీది సమర్థవంతమైన పాలన



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీది సమర్థవంతమైన పాలన అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పట్టణ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు రాజు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కావాలని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. దేశాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఎన్నికలు ఏవైనా ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయమే ధ్యేయంగా శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరేందర్, అనిల్, అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని 300 మంది ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అన్వర్ అలీ, మధుసూదన్ రావు, రమాకాంత్ రావు, విశ్వాస్, నరేందర్, సత్యనారాయణ, బెజ్జంకి రవీందర్, దయాకర్ రెడ్డి, ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ వీఆర్ కృష్ణ, రిజర్వేషన్ ఇన్‌చార్జి హాస్సేన్ పాల్గొన్నారు.

టోల్ ప్లాజా కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి

నేరడిగొండ: టోల్ ప్లాజాల్లో పనిచేస్తున్న కార్మికులందరిని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం రోల్‌మామడ టోల్ ప్లాజా కాంప్లెక్స్‌లో టోల్‌ప్లాజా యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాకే టోల్ ఆపరేట్ టాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిని అమలు చేయాలన్నారు. సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 8న నిర్వహించనున్న టోల్ ప్లాజా యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, పవార్ జితేందర్, గోవన్ సింగ్, అహ్మద్, చంద్రశేఖర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

భక్తి భావనతోనే మోక్ష మార్గం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జోగు రామన్న

బేల: భక్తి భావనతోనే మోక్ష మార్గం లభిస్తుందని ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మదీనా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర దీక్షలు చేపట్టి భక్తిమార్గంలో నడవడం అభినందనీయమన్నారు. ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.